1 YEAR HAPPY WORK ANNIVERSARY...

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

సంపుటి : 2 సంచిక : 33 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 15 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 33 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 15 Decmbar 2024 PAGES : 8 PRICE : 5/-

# ఎన్టీఆర్‌ను చరిత్ర మర్చిపోదు





- మనకు తెలిసిన, మనం చూసిన ఏకైక యుగపురుషుడు ఎన్టీఆర్
- ఎన్టీఆర్ తొలి చిత్రం మనదేశం.. ఆ చిత్రం విడుదలై 75 ఏళ్లు
- పోరంకిలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుక
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలో సినీ పాత్రికేయులకు విశిష్ట సత్కారం
- ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు
- సీనియర్ సినీ జర్నలిస్టులకు మెమెంటోల బహూకరణ
- తెలుగు వారు ఉన్నంత వరకూ గుర్తుండే పేరు ఎన్టీఆర్

విజయవాడ

తెలుగు జాతి ఉన్నంత వరకూ గుర్తుండే పేరు "ఎన్టీఆర్" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సినిమాల్లో ఎన్టీఆర్ అనేక పాత్రలు పోషించి మెప్పించారని చంద్రబాబు కొనియాడారు. రామురు, కృష్ణుడు వంటి అనేక పాత్రలు పోషించి - మిగతా3లో

## కష్టపడి పని చేసిన వారికే పదవులు

- అలాంటి నేతలకు పదవులు ఇచ్చే ప్రసక్తే లేదు: సీఎం చంద్రబాబు..
- కష్టపడందే ఏదీ రాదనే విషయం ప్రతీ ఒక్కరూ గ్రహించాలి
- కొందరు ఎమ్మెల్యే అయిపోయామనో, పదవులు వచ్చేశాయనో పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారు
- మంత్రైనా, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు ఏది వచ్చినా అది కేవలం పార్టీ వల్ల మాత్రమే వచ్చాయనే విషయాన్ని నేతలు దృష్టిలో పెట్టుకోవాలి
- జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 2029లోనే
- స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలో పాటు ప్రతిచోటా చర్చ జరగాలి
- వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతుంది



అమరావతి

టీడీపీ పార్టీలో కష్టపడి పని చేసిన వారికే పదవులు దక్కుతాయని టీడీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి స్పష్టం చేశారు. పనితీరు ఆధారంగానే గుర్తింపు, పదవులు ఉంటాయని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. పార్టీలో ఊరికే ఉన్నామంటే కుదరదని, అలాంటి నేతలు ఎటువంటి పదవులు ఆశించకూడదని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసంలో అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దిశానిర్దేశం చేశారు. ప్రజలకు, పార్టీకి సేవ - మిగతా3లో



## దేశ ఐక్యతకు రాజ్యాంగమే ఆధారం

- దానిని దెబ్బతీసేందుకు విషబీజాలు: మోదీ
- భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తి
- ఇవి యావత్ దేశం గర్వపడే క్షణాలు: ప్రధాని మోదీ
- "దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది
- మహిళలకు అన్ని రంగాల్లోనూ గౌరవం దక్కాలి
- ప్రజల మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది

## విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం

- 'ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్' లక్ష్యం
- ఉపాధ్యాయులపై భారం తగ్గిస్తాం
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం
- విద్యాశాఖ మంత్రి లోకేశ్
- ప్రతి నాలుగు గ్రామాలకు ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు



అమరావతి

'ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్' కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఉపాధ్యాయుల సహకారంతోనే అది సాధ్యమవుతుందని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేయాలని స్పష్టం చేశారు. - మిగతా3లో



## దేశంలో ఈ నాలుగు రాష్ట్రాల్లోనూ అత్యధిక రోడ్డు ప్రమాదాలు..!

- వెల్లడించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ..!
- రోడ్డు ప్రమాదాల్లో ఏటా 1,78,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారు
- వీరిలో 60 శాతం మంది 18-34 ఏళ్ల మధ్య వయస్కులే
- ప్రమాదాల సంఖ్య తగ్గింపు విషయాన్ని పక్కనపెడితే.. పెరిగిందన్న విషయం ఒప్పుకోవడంలో తనకు ఎలాంటి సందేహం లేదు
- ప్రమాదాల్లో ఇంత మంది చనిపోతున్నాయని చట్టానికి ఎవరూ పడడం లేదు

## ఆ లెక్కలపై తేల్చుకుందాం రండి

- ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- ఎవరు రైతులకు భరోసాగా నిలుస్తున్నారో ప్రజలందరికీ తెలుసు
- కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది
- కలెక్టరేట్ల దగ్గరకు బస్తాలు మోసుకువెళ్లి వైసీపీ నేతలు ఫొటోషూట్ చేశారు
- వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా వారిని మోసం చేసింది
- గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సైతం చంద్రబాబు సర్కారే చెల్లించింది




అమరావతి

కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తూ.. అండగా ఉంటుందని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ నేతలపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు రైతులకు భరోసాగా నిలుస్తున్నారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ పాలనలో గత ఖరీఫ్ సీజన్లో డిసెంబర్ 13నాటికి– 9,40,936 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ చేసిందని.. కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వివరించారు. కలెక్టరేట్ల దగ్గరకు బస్తాలు - మిగతా3లో

## అప్పుడు సావర్కర్ అలా ఇప్పుడు బీజేపీ ఇలా

- రాజ్యాంగం విషయంలో వారి తీరు విడ్డూరం'
- రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని వీడీ సావర్కర్ చెప్పారు
- బీజేపీ రాజ్యాంగాన్ని రక్షిస్తానడం విడ్డూరం
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



# కష్టపడి పని చేసిన వారికే పదవులు

-మొదటిపేజీ తరువాయి

చేయకుండా 30-40 ఏళ్ల నుంచి పార్టీలో ఉన్నామంటూ నేతలు పదవులు కావాలని అడగడం ఏమాత్రం సరికాదని సీఎం చంద్రబాబు అన్నారు. కష్టపడందే ఏదీ రాదనే విషయం ప్రతీ ఒక్కరూ గ్రహించాలని పార్టీ ముఖ్య నేతలకు సూచించారు. కొందరు ఎమ్మెల్యే అయిపోయామనో, పదవులు వచ్చేశాయనో పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రైనా, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు ఏది వచ్చినా అది కేవలం పార్టీ వల్ల మాత్రమే వచ్చాయనే విషయాన్ని నేతలు దృష్టిలో పెట్టుకోవాలని స్పష్టం చేశారు.

టీడీపీ పార్టీని బలోపేతం చేస్తూ నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయాల్లో కొనసాగుతారని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రభుత్వ పనులు ఆపకుండానే టీడీపీ పార్టీకి ఈసారి సమయం కేటాయిస్తున్నట్లు చంద్రబాబు చెప్పుకొచ్చారు. అలాగే పదవుల్లో ఉన్న నేతలు లేని నాయకులు సైతం నియోజకవర్గ స్థాయిలో పార్టీ కోసం కష్టపడాలని ఆయన సూచించారు. అలాంటి నాయకులనే గుర్తించి పైకి తీసుకొస్తామని ఆయన చెప్పుకొచ్చారు. అంతేకానీ ఏళ్ల తరబడి పార్టీలో ఉన్నామని చెప్పుకుంటూ ఏమాత్రం కష్టపడని వారికి పదవులు ఇచ్చే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు నిర్మోహమాటంగా చెప్పేశారు.

వైసీపీపై చంద్రబాబు ఆగ్రహం..

ఈ సందర్భంగా వైసీపీ పార్టీ, నేతలపై సీఎం చంద్రబాబు



ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారని చంద్రబాబు అన్నారు. వాళ్లు చేసే డ్రామాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. రేపటి తరం భవిష్యత్తు కోసమే స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమం అని ఆయన చెప్పారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలతోపాటు ప్రతీ చోటా దీనిపై చర్చ జరగాలని అన్నారు. విజన్-2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలని చెప్పారు. 1996 నాటి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు, 2020 నాటి పరిస్థితులు బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు కళ్లకు కనిపిస్తున్నాయని అన్నారు. భవిష్యత్తుతరాల బాగు కోసం చేసే ఈ ప్రయత్నంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమం ఒకరోజు పెట్టి వదిలేసేది కాదని, భవిష్యత్తు కోసమే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోందని, స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు.

దేశంలో జమిలి ఎన్నికలపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 2029లోనేనని స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మా మద్దతు ప్రకటించామని వెల్లడించారు. వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతుందని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారని విమర్శించారు. వైసీపీ చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలో పాటు ప్రతిచోటా చర్చ జరగాలని కోరారు.

విజన్ 2020 సాకారమైన తీరును నేటితరం తెలుసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 ఒకరోజు కోసం పెట్టి వదిలేసేది కాదని అన్నారు. భవిష్యత్ తరాల బాగుకోసం చేసే ప్రయత్నంలో అందరి భాగస్వామ్యం కావాలని, రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047అని తెలిపారు. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరాత్ర ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని వెల్లడించారు.

# ఎన్టీఆర్‌ను చరిత్ర మర్చిపోదు

-మొదటిపేజీ తరువాయి

తెలుగువారు పూజించే స్థాయికి ఆయన ఎదిగారని చెప్పారు. ఎన్టీఆర్ రూపంలోనే దేవుళ్లను చూస్తున్నామని చంద్రబాబు అన్నారు. సుమారు 300 సినిమాల్లో నటించి ప్రజలను ఆయన అలరించాలని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విజయవాడ మురళీ రిసార్ట్స్‌లో జరుగుతున్న ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా "తారక రామం" అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని సీఎం చంద్రబాబు అన్నారు. 1945 మద్రాసు రైలు ఎక్కిన తర్వాత ఎన్టీఆర్ జైత్రయాత్ర ప్రారంభమైందని చెప్పుకొచ్చారు. ఆ రోజుల్లో ఎన్టీఆర్ 10పైగా సినిమాల్లో నటించేవారని చెప్పారు. ఓ వైపు రాముడు, కృష్ణుడు వంటి దేవుళ్ల పాత్రలు చేస్తూనే మరోవైపు రావణాసురుడు, దుర్యోదనుడు వంటి పాత్రలను సైతం పోషించి మెప్పించారని కొనియాడారు. దాన వీర సూర కర్ణలో మూడు పాత్రలు చేసి అందరి మన్ననలు పొందారని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు.

జగద్విఖ్యాత మహా నటుడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నందమూరి తారకరామారావు తొలి చిత్రం మనదేశం విడుదలై 75 ఏళ్లయిన సందర్భంగా ఈ వేడుక జరుపుకుంటున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మనదేశం చిత్ర నిర్మాత కృష్ణవేణి గారు కూడా హాజరవడం విశేషమని అన్నారు. ఆమెకు ఇప్పుడు 102 సంవత్సరాలని, ఆమె పట్టుదలను మెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంతో పట్టుదలతో రావడమే కాకుండా, ఎలాంటి డిస్ట్రబెన్స్ లేకుండా ప్రశాంతంగా కూర్చున్నారని వివరించారు. అందుకు కారణం ఆమె జీవితంలో క్రమశిక్షణ అని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు రావడం హర్షణీయమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. దగ్గుబాటి సురేశ్, మాజీ ఎంపీ జయప్రద, ప్రభ, కృష్ణంరాజు అర్ధాంగి శ్యామల, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, కేఎస్ రామారావు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో సమర్థంగా నిర్వహిస్తున్నందుకు టీడీ జనార్ధన్ ను అభినందిస్తున్నానని తెలిపారు. ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ లేకపోతే ఈ కార్యక్రమం లేదని అన్నారు.

ఎన్టీఆర్ కు భారతరత్న సాధిస్తామని, ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వడం అంటే తెలుగుజాతిని గౌరవించడమేనని స్పష్టం చేశారు.

**రెండింటికి అర్థం... ఎన్టీఆర్**

ఇవాళ మనం ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుక జరుపుకుంటున్నాం. ఇదొక అపూర్వ ఘట్టం. గతేడాది ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు జరుపుకున్నాం. సంవత్సరమంతా ఉత్సవాలు జరుపుకున్నాం. ఒక యుగపురుషుడు జన్మించినప్పుడు చరిత్ర అతడిని మర్చిపోదు. అందుకు ఎన్టీఆర్ ఒక ఉదాహరణ. ఒక దేశంలో అని కాదు... ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆయన శతజయంతి వేడుకలు జరుపుకున్నాం. మరోసారి ఆయన పేరిట సినీ వజ్రోత్సవ వేడుక ఏర్పాటు చేసుకోవడం, మళ్లీ మనందరం ఆయన గురించి మాట్లాడుకోవడం సంతోషదాయకం. ఎన్టీఆర్ వంటి యుగపురుషులు అరుదుగా పుడతారు. మనకు తెలిసిన, మనం చూసిన ఏకైక యుగపురుషుడు ఎన్టీఆర్. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా, తెలుగుజాతి పేరు వింటేనే గుర్తుకు వచ్చే వ్యక్తి ఎన్టీఆర్. చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి హృదయాల్లో ఉండే వ్యక్తి ఎన్టీఆర్. అచ్చమైన తెలుగుదనం, తెలుగువాడి ఆత్మగౌరవం... ఈ రెండింటికి అర్థం ఎన్టీఆర్.

**చరిత్రలో ఇలా ఎక్కడా జరగలేదు**

ఒక చిన్న రైతు కుటుంబంలో పుట్టి, తెలుగు సినీ చరిత్రలో ఒక ఎవరెస్ట్ లా ఎదగడం, తొమ్మిది నెలల్లోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి కావడం చరిత్రలో ఎక్కడా జరగలేదు... భవిష్యత్తులోనూ జరుగుతుందన్న నమ్మకం లేదు... జరగదు. ఇటు వెండితెరను, అటు రాజకీయాలను ఏలిన ఏకైక నాయకుడు భారతదేశ చరిత్రలో ఎన్టీఆర్ ఒక్కరే. రంగం



ఏదైనా ఆయన అడుగుపెట్టిన ప్రతి చోటా సువర్ణ అధ్యాయాన్ని లిఖించారు. ఎన్టీఆర్ నటించిన తొలి చిత్రం మనదేశం... విడుదలై 75 సంవత్సరాలవుతోంది. ఇవాళ ఆయన లేకపోయినా మనం ఈ వేడుక జరుపుకుంటున్నామంటే అదీ ఎన్టీఆర్ గొప్పదనం. ఒక్కోసారి యుగపురుషుల చరిత్ర కూడా మనం నెమరువేసుకోవాలి. వారి జీవితాల నుంచి స్ఫూర్తిని పొందాల్సిన అవసరం ఉంది.

**ఆ రైలెక్కాక ఎన్టీఆర్ జైత్రయాత్ర మొదలైంది**

నిమ్మకూరు అనే పల్లెటూరులో వెంకట్రామమ్మ,లక్ష్మయ్య చౌదరి దంపతులకు 1923 మే 28న జన్మించిన కారణజన్ముడు ఎన్టీఆర్. నేను ఆయనను కలిసి చాలాసార్లు మాట్లాడినప్పుడు... అప్పుడప్పుడు తన చరిత్రను, జీవితంలోని సంఘటనలను నాకు కొంచెం చెప్పేవారు. చదువు కోసం విజయవాడకు వచ్చేవారు. తెల్లవారుజామునే లేచి... తల్లికి సాయంగా అనేక పనులు చేసేవారు. పాలను విక్రయించేవారు... ఆ తర్వాత కాలేజికి వెళ్లేవారు. జీవితం మొదట్లో అందరికీ కష్టాలు ఉంటాయి... ఆ తర్వాత మనశక్తిని బట్టి మన జీవితాన్ని మలుచుకుంటాం.

1945లో మద్రాసు రైలెక్కాక ఎన్టీఆర్ జైత్రయాత్ర మొదలైంది. సినిమా రంగంలో ఆయన మొదట్లో నెలవారీ జీతం తీసుకునేవారు. ఎల్వీ ప్రసాద్, నాగిరెడ్డి, చక్రపాణి తదితరులు ఆయనకు సినిమాల్లో అవకాశాల కోసం సహకరించారు. ఆ తర్వాత సాంఘిక, పౌరాణిక, జానపద, చారిత్రక సినిమాల్లో నటించి, ఆయా పాత్రలకు ప్రాణం పోశారు. 300 సినిమాల్లో నటించారు. అప్పట్లో ఆయన ఏడాదికి 10 నుంచి 15 సినిమాలు చేసేవారు. ఇప్పుడు ఒక సినిమా తీయాలంటే మూడేళ్లు పడుతోంది. కానీ ఎన్టీ రామారావు మాత్రం పెద్ద సంఖ్యలో సినిమాల్లో నటించేవారు.

**అలాంటి నటులు మరొకరు దొరకరు... కనిపించరు!**

భారతదేశ సినీ చరిత్రలో ఎన్టీఆర్ లా విభిన్న పాత్రలు పోషించే నటులు మరెవరూ లేరు... దొరకరు... కనిపించరు! ఆయన ఏ పాత్ర పోషించినా... ఆ పాత్రలో జీవించారు. వెంకటేశ్వరస్వామి పాత్ర వేయాలన్నా, శ్రీకృష్ణుడి పాత్ర వేయాలన్నా, రాముడిగా నటించాలన్నా ఎంతో క్రమశిక్షణతో ఉండేవారు. ఆ సమయంలో మాంసాహారం తినేవారు కాదు... ఇంట్లో మంచం మీద కాకుండా చాప మీద పడుకునేవారు. నిబద్ధతకు ఉదాహరణలా నిలిచారు. దేవుడు ఎలా ఉంటాడో ఆ రూపం మనకు తెలియదు కానీ, ఎన్టీఆర్ రూపంలో దేవుడ్ని చూస్తున్నాం.

ఓసారి ఎన్టీఆర్ గారిని అడిగాను... మీరు రాముడిగా నటిస్తారు, రావణుడిగా నటిస్తారు... శ్రీకృష్ణుడిగా నటిస్తారు, ధుర్యోధనుడిగా నటిస్తారు... ఎలా సమన్వయం చేసుకుంటారు అని అడిగాను. అందుకాయన ఒకటే మాట చెప్పారు... ఏ క్యారెక్టర్ కు ఆ క్యారెక్టర్ డిఫరెంట్ గా ఉంటుంది... వాళ్లు విలక్షణ వ్యక్తిత్వం ఉన్నవారు. వాళ్ల వ్యక్తిత్వాలు కూడా విశిష్టంగా ఉంటాయని ఆ క్యారెక్టర్లను జస్టిస్ పై చేసిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్. ఆయా క్యారెక్టర్లలోని మంచి గుణాలు నచ్చి, ఆ పాత్రలు పోషించాడు.

దానవీరశూరకర్ణలో మూడు పాత్రలు పోషించి, మళ్లీ దర్శకత్వం కూడా వహించారు. నేను చేయలేనిది ఏదీ లేదు... ఏదైనా సరే చేసి చూపిస్తాను అని చేసి చూపించిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్. అందుకే సినిమాల్లో 24 క్రాఫ్ట్స్ గురించి తెలిసిన ఏకైక కథానాయకుడు నందమూరి తారకరామారావు.

నా చిన్నప్పుడు లవకుశ సినిమా చూశాను. ఎక్కడో పల్లెటూరి నుంచి ఎడ్లబండ్లు కట్టుకుని వచ్చి ఆ సినిమా చూసేవారు. ఇలాంటివి ఎన్నో. పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర, శ్రీనాథ కవిసార్వభౌమ వంటి సినిమాల కోసం ఎంతో రీసెర్చ్ చేసి ఆయా పాత్రలు పోషించారు. తోడుదొంగలు సినిమాకు రాష్ట్రపతి అవార్డు వచ్చింది.

**రాజకీయాల్లోనూ ఆయన హీరో**

సినిమాల్లో హీరోగా చేసినట్టే... రాజకీయాల్లోనూ నిజమైన హీరో అనిపించుకున్నారు. నేను ఆయనను కలిసిన తర్వాత నా పెళ్లి జరిగింది. ఆ తర్వాత ఆయనతో ఓసారి చర్చ జరిగింది. అప్పుడు ఆయన ఏం చెప్పారంటే... 60 ఏళ్లు నేను కుటుంబం కోసం బతికాను. ప్రజలు నన్ను ఆదరించారు. తిరిగి నా శేషజీవితాన్ని ఈ ప్రజలకు అంకితం చేయాలనుకుంటున్నానని చెప్పి, రాజకీయాల్లోకి ప్రవేశించారు. చైతన్యరథం ఎక్కి 9 నెలలు రాష్ట్రమంతటా తిరిగారు. పిల్లల పెళ్లిళ్లకు కూడా రాకుండా ఆయన సమాజం కోసం అంకితమయ్యారు. 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్థాపించిన పార్టీ శాశ్వతంగా ఉంటుంది. తెలుగు జాతి ఉన్నంతవరకు నందమూరి తారకరామారావు పెట్టిన తెలుగుదేశం పార్టీ చిరస్థాయిగా ఉంటుంది. మేం ఆన్ లైన్ లో పార్టీ సభ్యత్వాలు నమోదు చేస్తుంటే, ఇప్పటికే 73 లక్షల మంది సభ్యత్వాలు తీసుకోవడం టీడీపీ శక్తికి నిదర్శనం.

**ఆయన తెలుగుజాతి పౌరుషం, తెలుగుజాతి ఆత్మగౌరవం**

తెలుగుజాతి ఆత్మగౌరవం, తెలుగుజాతి పౌరుషం అంటే ఎన్టీఆర్ గుర్తొస్తారు. మహిళలకు ఆస్తి హక్కు ఇచ్చిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందు సంక్షేమ పథకాలు అనేవే లేవు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందు... ప్రభుత్వం అంటే పరిపాలన, పెత్తందారు వ్యవస్థ అన్నట్టుగా ఉండేది. కానీ కూడు, గూడు, గుడ్డ నినాదంతో పాలనకు కొత్త అర్థం చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. ఇప్పుడు మేం కూడా ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరిక నిర్మూలనకు కృషి చేయడమే కాకుండా... ఆర్థిక అసమానతలను తగ్గించే బాధ్యతను తెలుగుదేశం పార్టీ తీసుకుంటుంది" అంటూ చంద్రబాబు స్పష్టం చేశారు.

**సీనియర్ సినీ జర్నలిస్టులకు మెమెంటోల బహూకరణ**

కృష్ణా జిల్లా పోరంకిలో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ కార్యక్రమంలో సీనియర్ సినీ పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ డైమండ్ జూబ్లీ పేరిట ప్రత్యేకంగా తయారుచేయించిన జ్ఞాపికలను ముఖ్యమంత్రి చంద్రబాబు సీనియర్ సినీ జర్నలిస్టులకు బహూకరించారు. మోహన్ గోటేటి, బీకే ఈశ్వర్, కె.ఉదయవర్లు, కె.ఉమామహేశ్వరరావు, గౌస్, శాతవాహన, యు.వినాయకరావు, రెంటాల జయదేవ, అనురాధ, రమణమూర్తి తదితర పాత్రికేయులు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా మెమెంటోలు అందుకున్నారు.

కాగా, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఎం చంద్రబాబు, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ స్పెషల్ క్యాలెండర్ ను కూడా ఆవిష్కరించారు. దాంతోపాటే, తారకరామం-అన్న గారి అంతరంగం పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ఎన్టీఆర్ సినిమా కెరీర్ విశేషాలు, పలు ఇంటర్వ్యూలో ఆయన చెప్పిన మాటలు, ఆయన గురించి సమాచారాన్ని, ఆయన గురించి ఇతర ప్రముఖులు చెప్పిన మాటలను పొందుపరిచారు.

## ఆ లెక్కలపై తేల్చుకుందాం రండి..

-మొదటిపేజీ తరువాయి

మోసుకువెళ్లి వైసీపీ నేతలు ఫొటోషూట్ చేశారని విమర్శించారు. గత సీజన్లో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో కనీసం సేకరణ ఎందుకు చేపట్టలేదని అన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ధాన్యం కొనుగోలులో అనేక సంస్కరణలు



తీసుకువచ్చినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా వారిని మోసం చేసిందని ఆయన ఆగ్రహించారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సైతం చంద్రబాబు సర్కారే చెల్లించినట్లు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ఈ ఏడాది సంక్రాంతి రాకముందే రైతులు కళ్లల్లో ఆనందం కనపడుతోందని మంత్రి చెప్పారు. రైతులకు అండగా నిలబడకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్షల కోట్ల బడ్జెట్ వృథాగా మారుతుందన్నారు. అందుకే వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పుడూ రైతుల గురించే ఆలోచిస్తారని తెలిపారు. వారికి మంచి చేయాలనే ఉద్దేశంతో నిరంతరం కష్టపడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలో ధాన్యం దిగుబడి అధికంగాఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. అలా ఆందోళన చెంది దళారులకు తక్కువ ధరకే విక్రయించవద్దని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కాల్సిందేనని అన్నారు. అందుకు ప్రభుత్వం అన్నీ చర్యలు చేపట్టిందని... ధాన్యంలో తేమ 20 శాతం వరకు ఉన్నా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా రైతులకు అందించేందుకు టార్పాన్లు సైతం మొదటిసారి అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. మిల్లర్లకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించామని అన్నారు. కాబట్టి వారంతా రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

## విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం:

-మొదటిపేజీ తరువాయి

సంస్కరణల అమలులో పొరపాట్లు జరిగితే సంబంధిత నిర్ణయాలను వెనక్కి తీసుకోవడానికి వెనకాడమన్నారు. ఫలితాల విషయంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు స్కూళ్లతో పోటీపడాలని సూచించారు.



**ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మంత్రి:**

ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాల సాధనే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించామని, ఇప్పుడు అమలు చేయకపోతే రాబోయే పదేళ్లల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్? వెల్లడించారు. జీఓ-117 రద్దు నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, వంద రోజుల ప్రణాళిక, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మంత్రి ఉండవల్లి నివాసంలో నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. సంస్కరణల అమలులో కొన్ని పొరపాట్లు జరిగితే సంబంధిత నిర్ణయాలను వెనక్కి తీసుకోవడానికి తాము వెనకాడమని మంత్రి స్పష్టం చేశారు.

**విద్యావ్యవస్థ బలోపేతమే లక్ష్యం:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతూ వస్తోందని, డ్రాపవుట్స్ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ముస్లిం కుటుంబాల్లో ఈ సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రాథమిక పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. 300 పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయని ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయుల సహకారం అవసరమని స్పష్టం చేశారు. సర్కారు విద్యలో ఎక్కడ లోపాలున్నాయో తెలుసుకొని సరిదిద్దుతామన్నారు. చిన్న పిల్లలు నాలుగైదు కిలోమీటర్ల నుంచి బడులకు రావడం కష్టమవుతున్నందునే జీఓ-117ను రద్దు చేసి, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించామని చెప్పారు. ఉపాధ్యాయులపై అనవసరమైన యాప్ ల భారం తగ్గించామని, ఇంకా అమలులో ఉన్న నాన్ అకడమికమ్ యాప్ ల బాధ్యతను తొలగించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

**ప్రతి నాలుగు గ్రామాలకు ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు:**

కూటమి ప్రభుత్వంలో ఒక్క ప్రభుత్వ స్కూలు కూడా మూతపడకూడదు. ఒక్క టీచర్ సైతం తగ్గకూడదని మంత్రి లోకేశ్ ఆదేశించారని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. ఫలితాల సాధన, హాజరుశాతం పెంపుదలకు ఉపాధ్యాయులు కృషిచేయాలని స్పష్టం చేశారు. ప్రవేశాలు పెంచేందుకు గ్రామాల పరిధిలోని బడిఈడు పిల్లల సమాచారంతో రిజిస్టర్ నిర్వహిస్తే బాగుంటుందని, గతంలో ప్రధానోపాధ్యాయులు చేసేవారని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు, పదోన్నతులు నిర్వహిస్తామని డైరెక్టర్ విజయరామరాజు వెల్లడించారు. తరగతికి ఒక టీచర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి నాలుగైదు గ్రామాలకు ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసేలా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. మెరుగైన ఫలితాల కోసం వందరోజుల పాఠ్యప్రణాళికను పకడ్బందీగా అమలుచేయాలని స్పష్టం చేశారు.

**పదోన్నతులు కల్పించాలన్న ఉపాధ్యాయ సంఘాలు:**

సెకండరీ గ్రేడ్ టీచర్లు 20ఏళ్లు పని చేసినా స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల పదోన్నతితోనే ఆగిపోతున్నారని, లెక్చరర్లు, డిప్యూటీ ఈవో స్థాయి వరకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విన్నవించారు. నాలుగైదు గ్రామాలను కలిపి ఏర్పాటు చేసే మోడల్ స్కూలుకు రవాణా సౌకర్యం కల్పించాలని, ప్రాథమిక బడుల్లో తెలుగు మాధ్యమం అమలు చేయాలని విన్నవించారు. గ్రామీణ బడులకు పీఈటీలను నియమించాలని, అంతర జిల్లా బదిలీలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, అశోక్‌బాబు, వేపాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదులో టీడీపీ సరికొత్త రికార్డు సృష్టించింది

సభ్యత్వ నమోదులో టీడీపీ సరికొత్త రికార్డు సృష్టించిందని పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ సంఖ్య 73 లక్షలకు చేరుకుందని చెప్పిన ముఖ్యమంత్రి.. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నేతలను ఆయన అభినందించారు. టాప్-5లో రాజంపేట, నెల్లూరు, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. భారీగా కొత్త సభ్యత్వాలకు తోడుగా పెద్ద సంఖ్యలో యువత, మహిళల సభ్యత్వాలు నమోదైనట్లు చంద్రబాబు తెలిపారు. క్యాడర్ సంక్షేమంతో పాటు అందరి ఎదుగుదలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు. చంద్రబాబు ఇంకా మాట్లాడుతూ.. "పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయాల్లో కొనసాగుతారు. పనితీరు ఆధారంగా గుర్తింపు ఉంటుంది. పార్టీ వల్లే ఏ పదవైనా అని గ్రహించి ప్రవర్తించాలి. కష్టపడనిదే ఏదీ రాదనే విషయం ప్రతిఒక్కరూ గ్రహించాలి. ప్రజలు, పార్టీకి సేవ చేయకుండా పదవులు ఇమ్మనడం సరికాదు. కొందరు పదవులు వచ్చేశాయని పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు అయ్యామని నిర్లక్ష్యం చేస్తున్నారు. పదవులు తప్ప ఊరికే పార్టీలో ఉన్నామంటే కుదరదు" అని చంద్రబాబు అన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 15.12.24
ఆదివారం

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## అద్దంకి నియోజకవర్గంలో 35 మేజర్ ఇరిగేషన్ 14 సప్లయ్ ఛానల్ టీడీపీకి ఏకగ్రీవం

ఏకగ్రీవమైన సభ్యులను అభినందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిశంబర్ 14)

అద్దంకి నియోజకవర్గంలో 35 మేజర్ ఇరిగేషన్, 14 సాగునీటి చెరువు సప్లయ్ ఛానల్ స్థానాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ మద్దతుదారులు అన్ని స్థానాల్లో విజయదుందుభి మోగించారు. అన్ని సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నిక కాబడిన అధ్యక్షులతో పాటు ఉపాధ్యక్షులను, డైరెక్టర్లను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు. వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## పరిశ్రమలు, వ్యవసాయం బలోపేతంతోనే

# జిల్లా అభివృద్ధి సాధ్యం

జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 14)

పరిశ్రమలు, వ్యవసాయం దాని అనుబంధ రంగాలను బలోపేతం చేయటం ద్వారా జిల్లాను సమగ్ర అభివృద్ధి పథంలో నడిపించేలా దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రకాశం జిల్లాకు సంబంధించి రూపొందించిన విజన్ డాక్యుమెంటులో ఈ అంశాలను ప్రధానంగా ప్రస్తావించినట్లు ఆమె చెప్పారు.

**పరిశ్రమలు :** పామూరులో నిమ్జ్, అలాగే దొనకొండలో ఇండస్ట్రియల్ ఏరియాను అభివృద్ధి చేయటం ద్వారా జిల్లాను పారిశ్రామికంగా ముందుకు తీసుకు వెళ్లవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో విరివిగా స్థలాలు అందుబాటులో ఉండడంతో పాటు జాతీయ రహదారులు, నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైను కూడా ఈ ప్రాంతం నుంచి వెళ్తుండటం సానుకూల పరిణామమని ఆమె చెప్పారు. దొనకొండలో ఇండస్ట్రియల్ ఏరియా అభివృద్ధి కోసం వెలుగొండ ప్రాజెక్టు నుంచి నేరుగా ప్రత్యేక వాటర్ పైప్ లైన్ ఏర్పాటు చేయటం ద్వారా పారిశ్రామిక అవసరాలకు నీటి సమస్య లేకుండా చూడవచ్చు అన్నారు.

**ఆక్వాకల్చర్ :** కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ రావడం వలన మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. దీనికితోడు పాలేరు, ముసి నదులను అనుసంధానం చేస్తే ఆక్వాకల్చర్ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దీనికి రూ.75 కోట్ల వరకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు. తమిళనాడు నుంచి ప్రత్యేక సోనా బోట్లలో వస్తున్న మత్స్యకారుల వలన స్థానిక మత్స్యకారులకు సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, ఈ విషయం తమ దృష్టిలో ఉన్నదని చెప్పినట్లు కలెక్టర్ తెలిపారు.

**పాడి పరిశ్రమ :** గతంలో ప్రకాశం జిల్లాకు తలమానికంగా నిలిచిన ఒంగోలు డైరీ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు. స్వయం సహాయక సంఘాల మహిళలను లక్షాధికారులుగా చేయడానికి, ముఖ్యంగా ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదిగేలా చూడాలన్న ప్రభుత్వ ఆలోచనలను మరింతగా ముందుకు తీసుకు వెళ్ళటానికి ఈ డైరీ పునరుద్ధరణ కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. పశు పోషణ ఆధారంగా జీవనోపాధి పొందుతున్న వారిని ఆర్థికంగా మరింత బలవపేతం చేసి పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి డైరీ పునరుద్ధరణ ప్రత్యేక ఉత్ప్రేరకంగా ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు.

**వ్యవసాయం :** జిల్లాలో పత్తి, పొగాకు, కంది, శనగ పంటల దిగుబడిని పెంచడంతో పాటు ప్రకృతి సేద్య విధానాన్ని మరింత ప్రోత్సహించేందుకు ఉన్న అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో వివరించినట్లు కలెక్టర్ తెలిపారు. కరువు పరిస్థితుల్లోనూ పంటలపై పెద్దగా ప్రతికూల ప్రభావం పడకుండా " ఫెర్టిగేషన్ " టెక్నాలజీతో సేద్యాన్ని ముందుకు తీసుకువెళ్లడం పై దృష్టి సారించినట్లు చెప్పారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం 90 వేల హెక్టార్లలో ఉద్యానపంటలు సాగు అవుతున్నాయని, మరో లక్షా 50 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం ద్వారా దీనిని విస్తరించేలా దృష్టి పెట్టామన్నారు.

**గోదాములు :** జిల్లాలోని ఖాళీ గోదాములను అమెజాన్, ఫ్లిప్కార్ట్ వంటి వాణిజ్య సంస్థలు లాజిస్టిక్ హబ్స్ గా వినియోగించుకునేలా దృష్టి సారించామన్నారు. ఆయా సంస్థలకు చెన్నై, హైదరాబాదులో ఇలాంటి హబ్స్ ఉన్నాయని, ఈ నగరాలకు మధ్యలో ఉన్న ప్రకాశం జిల్లా గుండా జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉన్నందున స్థానిక గోదాములను ఈ విధమైన లాజిస్టిక్స్ హబ్ లుగా వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. (తరువాయి 4లో...)

# సీఎంఆర్ఎఫ్‌తో ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నాం

రూ.11,09,848 ల చెక్కులను అందించిన

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, డిశంబర్ 14)

సీఎంఆర్ఎఫ్‌తో రాష్ట్రంలోని ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. కొండపి నియోజకవర్గంలో పలువురికి రూ.11,09,848 లు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ముఖ్యమంత్రికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



# నాకేం తెలియదు.... నాకేం గుర్తు లేదు

ఇదీ సీఐడీ విశ్రాంత ఏఎస్పీ ఆర్ విజయ్‌పాల్ సమాధానం

రెండు రోజులు కస్టడీకి తీసుకున్నా ఫలితం శూన్యం



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, డిశంబర్ 14)

నాకేం తెలియదు...నాకేం గుర్తు లేదు ఇదీ మాజీ ఎంపి, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు గాయాలు చేసిన ఘటనలో విశ్రాంత సీఐడీ ఏఎస్పీ ఆర్ విజయ్‌పాల్ సమాధానం.....గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదు కాబడిన కేసులోని 4వ ముద్దాయి సీఐడీ విశ్రాంత అదనపు ఎస్పీ ఆర్ విజయ్‌పాల్‌ని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించారు. గంటల కొద్ది ప్రశ్నల వర్షం కురిపించినా ఫలితం మాత్రం శూన్యం. కస్టడీలో రఘురామ కృష్ణరాజుకు గాయాలు ఎలా అయ్యాయి? అనే ప్రశ్నతో మొదలు పెట్టిన జిల్లా పోలీసులు సుమారు 50 ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తుంది. అయితే ఏ ఒక్క ప్రశ్నకు విజయ్‌పాల్ సక్రమంగా సమాధానం చెప్పినట్లు తెలియడం లేదు. ఏది అడిగినా దాటవేత ధోరణి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. రఘురామకృష్ణంరాజును అరెస్ట్ చేసినప్పుడు (తరువాయి 4లో...)

# పది నెలల బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

రంగంలోకి దిగిన ప్రకాశం పోలీసులు

ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పర్యవేక్షణలో గంటల వ్యవధిలో తల్లి ఒడి చేరిన బాలుడు

పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

బాలుడిని అప్పగించిన పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బాబు తల్లితండ్రులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 14)

*గంటల వ్యవధిలో కిడ్నాప్‌కు గురైన బాలుడిని శనివారం తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ చేతుల మీదుగా అప్పగించారు. శనివారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు.* (తరువాయి 4లో...)






# పది నెలల బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం







ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఊర్వశి, ప్రదీప్ దంపతులు సుమారు ఐదు సంవత్సరాల నుంచి ఒంగోలులోని కార్ కేర్ షాప్ నందు మెకానిక్‌గా పని చేయుచున్నారు. శుక్రవారం ఊర్వసి తన పక్కింట్లో పనిచేసే దయామనిని తన పది నెలల పిల్లవాడిని చూసుకోమని చెప్పి స్నానానికి వెళ్ళింది. స్నానానికి వెళ్లి తిరిగి వచ్చి బాబుని ఇవ్వమని అడుగగా కొట్టు దాకా వెళ్లి వచ్చి బాబుని ఇస్తానని చెప్పి బాబుని తీసుకుని వెళ్లిపోయింది. ఎంత సేపటికి తిరిగి రాకపోయేసరికి దయామని పనిచేసే ఇంట్లోకి వెళ్లి చూడగా ఆమె బట్టలు కూడా కనపడనందున అనుమానించి శుక్రవారం సాయంత్రం సుమారు మూడు గంటల సమయంలో పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన తాలూకా పోలీసులు ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేశారు. ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 5 బృందాలను ఏర్పాటు చేశారు. వన్ టౌన్ సిఐ ఆధ్వర్యంలో ఒక బృందం, టూ టౌన్ సిఐ ఆధ్వర్యంలో రెండో బృందం, తాలూకా సిఐ ఆధ్వర్యంలో మూడో బృందం, రూరల్ సీఐ ఆధ్వర్యంలో నాలుగో బృందం, సింగరాయకొండ సిఐ ఆధ్వర్యంలో 5వ బృందం ఏర్పాటు చేసి కిడ్నాప్ అయిన బాలుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తూ బాలుడు యొక్క ఫోటోలను, కిడ్నాప్ చేసిన వ్యక్తి యొక్క ఫోటోలను అన్ని వాట్సఅప్ గ్రూపుల్లోనూ, మహిళా పోలీస్ వాట్సఅప్ గ్రూపుల్లో, విలేజ్ వాట్సప్ గ్రూపుల్లోనూ, రైల్వే పోలీస్ వాట్సాప్ గ్రూపు లోను ఇలా అన్ని వాట్సఅప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో తనకు వచ్చిన సమాచారంతో తాలూకా సిఐ అజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్ళు సింగయ్య, రవి లతో కలిసి గుడ్లూరు మండలంలోని మామిడితోటలో కిడ్నాపైన బాలుడిని ఉంచారని తెలుసుకొని ఉలవపాడు ఎస్ఐ అంకమ్మ సహకారంతో మామిడి తోటలోకి వెళ్ళగా పోలీసులు రాకను గమనించిన వారు బాలుడిని అక్కడ వదిలేసి పరారయ్యారు. అక్కడ కిడ్నాప్ గురైన బాలుడిని రక్షించి పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడ నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి తరలించారని తెలిపారు. అనంతరం కేసు వ్యవహారంలో కీలకంగా



వ్యవహరించిన ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి రివార్డులు అందించి అభినందనలు తెలిపారు.

# నాకేం తెలియదు...నాకేం గుర్తు లేదు





ఆరోగ్యంగానే ఉన్నారని, రిమాండ్‌కు తరలించే సమయంలో మాత్రం గాయాలతో నడవలేకుండా ఉన్నారని, ఈ మధ్యలో ఏం జరిగిందని విజయ్‌పాల్‌ను అధికారులు ప్రశ్నించారు. ఆయనకు గాయాలు ఎలా అయ్యాయని, సీఐడీ కార్యాలయానికి తరలించినప్పుడు నలుగురు ముసుగు వ్యక్తులు వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారని, వారెవరని ప్రశ్నించారు. విచారణ అధికారులు అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన తనకు తెలియదని, చూడలేదని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. కస్టడీలో రఘురామ కృష్ణరాజును కొట్టారా? అని ప్రశ్నిస్తే లేదని చెప్పారని సమాచారం. ముసుగు వ్యక్తుల గురించి తనకు తెలియదని, వారిని తాను చూడలేదని చెప్పారు. సాక్ష్యాలు చూపించి ప్రశ్నించినా తప్పించుకునేలా సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. అలాగే, రఘురామను వేధించాలని ఆదేశించింది ఎవరన్న ప్రశ్నకు కూడా ఆయన నేరుగా సమాధానం చెప్పలేదని తెలిసింది. కాగా శుక్రవారం ఆరున్నర గంటలపాటు విజయ్‌పాల్‌ను విచారించిన అధికారులు, శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విచారించిన అనంతరం శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నుండి గుంటూరుకు కట్టుదిట్టమైన ఎస్కార్ట్‌తో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ పంపారు. మరి ఈ కేసులో ఇంకెప్పుడు ఆయన నుంచి పోలీసులు సమాధానాలు రాబడతారో వేచి చూడాల్సిందే...!

# పరిశ్రమలు, వ్యవసాయం బలోపేతంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యం

**ఇరిగేషన్ :** జిల్లాకు ప్రధాన నీటి వనరుగా నిలువనున్న వెలిగొండ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయటం ద్వారా జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలకు ఎలాంటి సమస్యా ఉండదన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కలెక్టర్ కోరారు.

**విద్య :** జిల్లా ముద్దుబిడ్డ ప్రకాశం పంతులు పేరుమీద ఏర్పాటు చేసిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయిలో సిబ్బందిని కేటాయించి బలోపేతం చేయాల్సి ఉన్న అవసరాన్ని కలెక్టర్ ప్రధానంగా ప్రస్తావించారు. సొంత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని, అదేవిధంగా ట్రిపుల్ ఐటీ కోసం కూడా నిధులు కావాలని ఆమె కోరారు.

**పర్యాటకం :** స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంటులో ప్రస్తావించిన పర్యాటక అభివృద్ధి ప్రణాళికలో ప్రకాశం జిల్లాకు కూడా సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఉన్న తీర ప్రాంతం, ఆధ్యాత్మిక కేంద్రాలు, చారిత్రక విశిష్టత కలిగిన మానవ నిర్మిత కంభం చెరువు, తదితర అంశాలను కలెక్టర్ తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో ప్రస్తావించారు. వీటిని తగిన విధంగా అభివృద్ధి చేయటం ద్వారా పర్యాటకంగానూ ప్రకాశం జిల్లా ముందడుగు వేస్తుందని ఆమె తెలిపారు. తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయన్నారు.


**నైపుణ్యాభివృద్ధి :** మానవ వనరులు పుష్కలంగా ఉన్నందున వారికి ఆసక్తి మేరకు వివిధ రంగాలలో తగిన నైపుణ్యం కల్పించడం కోసం ప్రస్తుతం చేపట్టిన చర్యలు , భవిష్యత్తు ప్రణాళికలను కూడా కలెక్టర్ వివరించారు.

**రియల్ ఎస్టేట్ :** జిల్లా నుంచి జాతీయ, రాష్ట్ర రహదారులు, రైలు మార్గాలు వెళ్తున్నందున కనెక్టివిటీ పెరుగుతున్నదని, దీనికి తోడు అమరావతికి దగ్గరలోనే ఉండటం వలన ఇప్పటికే రియల్ ఎస్టేట్ అభివృద్ధి పథంలో సాగుతున్నదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని స్థానిక అవసరాలకు తగినట్లుగా మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా స్థిరాస్తి రంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆమె చెప్పారు. ఈ దిశగా ఉన్న మరిన్ని అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆమె సవివరంగా ప్రస్తావించారు.

# మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు టీడీపీ కైవసం

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, డిసెంబర్ 14)**

యర్రగొండపాలెం మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు టీడీపీ కైవసం చేసుకుంది. దీంతో యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు తెలుగుదేశం పార్టీ కూటమి శ్రేణులు. యర్రగొండపాలెం ప్రెసిడెంట్ కొప్పర్తి వెంకటరెడ్డి ,వైస్ ప్రెసిడెంట్ ఆముదం గంగిరెడ్డి మురారిపల్లిజి ప్రెసిడెంట్ బాసం లక్ష్మి రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ కైపు వెంకట రెడ్డి, వెంకటాద్రిపాలెం ప్రెసిడెంట్ బోడ చెన్న వీరయ్య, వైస్ ప్రెసిడెంట్ దూదేకుల బాదుల్లా అమానిగుడిపాడు ప్రెసిడెంట్ పుచ్చకాయల చిన్న అంకయ్య, వైస్ ప్రెసిడెంట్ ఒంటేరు రాజయ్య, కొలుకుల ప్రెసిడెంట్ కర్రె నరసమ్మ, వైస్ ప్రెసిడెంట్ గల్లా బాదరయ్య, గంగపాలెం ప్రెసిడెంట్ మాగులూరి బక్కయ్య, వైస్ ప్రెసిడెంట్ తోట గురువర్ధిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సాగునీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.







# జాతీయ లోక్ అదాలత్‌లో 440 కేసులు పరిష్కారం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 14)**

కనిగిరి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కనిగిరి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 440 కేసులు పరిష్కారం అయినట్లు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్ చంద్ర తెలిపారు. ఈసందర్భంగా క్రిమినల్ కేసులు 110, సివిల్ కేసులు 3,భరణం కేసులు 3,ఎస్ టి సి 324 ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు న్యాయమూర్తి తెలిపారు.కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజ మార్గాన్ని అనుసరించాలని జడ్జి కె.భరత్ చంద్ర సూచించారు.చిన్న పొరపాటు క్షణికావేశం కారణంగా గొడవలు,మనస్పర్ధలు పెట్టుకొని కేసులు దాకా వెళ్ళి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా,ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రాజీ మార్గమే రాజ మార్గం అని అన్నారు.

# కనిగిరి పెద్ద చెరువు నీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవం

## అధ్యక్షులుగా తమ్మినేని ఇందిరప్రసున్న ఎన్నిక






**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 14)**

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వం లో కనిగిరి పెద్ద చెరువు నీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నికైన తమ్మినేని ఇందిరప్రసున్న ,ఉపాధ్యక్షులుగా ఎన్నికైన చింతం కిరణ్ కుమార్, కమిటీ సభ్యులుగా ఎన్నికైన పటాన్ కరీం, ఇమామ్, మల్లికార్జున్, బత్తుల రత్తయ్యని పలువురు అభినందించారు. అభినందించిన వారిలో పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి , పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చింతలపూడి తిరుపాలు, రిజ్వాన్, ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# నేడు ఆత్మార్పణ దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 14)**

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆ మహనీయుని వర్ధంతిని (డిసెంబర్ 15) ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం ఉదయం నగరంలోని ఆత్మకూరు బస్టాండు కూడలి వద్ద గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా అధికారులు, పలువురు ప్రముఖులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తారు. అనంతరం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్లోని సిబ్బంది పాల్గొని నివాళులర్పిస్తారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో నగర ప్రజలు, ప్రముఖులు పాల్గొని ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన ఆ ధన్యజీవికి నివాళులర్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# నెల్లూరులో ఘనంగా జోస్ ఆలుక్కాస్ షో రూమ్ ప్రారంభం








(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 14)

నెల్లూరు నగరంలోని స్థానిక మాగుంట లేఔట్ లో జోస్ ఆలుక్కాస్ షో రూంను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటి పాయల్ రాజ్ పుత్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో ప్రారంభమైన షోరూం విజయవంతం కావాలని, ఈ షో రూమ్ నుండి పేదలకు,మధ్యతరగతి కుటుంబాలకు ఉపాధి కలుగుతుందని, ధరలు కూడా అన్ని విధాల ప్రజలకు అనుకూలంగా ఉంటాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మా నెల్లూరు వాళ్లకి బంగారం మీద ఉన్న ఆసక్తి మనందరికీ తెలిసిందే మీరు ఇలాగే మంచి మంచి రకముల ఆభరణాలు తీసుకొస్తే మా నెల్లూరు ప్రజల నుండి మీకు ఆరాధన కచ్చితంగా లభిస్తుంది అని తెలిపారు. వారందరూ మాట్లాడుతూ ఈ షోరూం కూడా అత్యంత ఘన విజయం కావాలంటూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సినీ నటి పాయల్ రాజ్ పుత్ మాట్లాడుతూ నేను ఈ జోస్ ఆలుక్కాస్ షో రూమ్ ఓపెనింగ్ కు రావడం ఇది రెండవసారి వీళ్ళతో నాకు మంచి అనుబంధం ఉంది . వీళ్ళు ఎప్పుడు ప్రజలకు అన్ని విధాలుగా సహకరించే ధరలతో మంచి మంచి వెరైటీలతో కొత్త కొత్త బ్రాండ్స్‌తో మెంబర్షిప్ అయ్యి నూతన ఆభరణాలు అందిస్తారు... అని వారు చెప్పారు. అనంతరం జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కాస్, పాల్ జె ఆలుక్కాస్‌లు తమ షోరూం ప్రారంభం సందర్భంగా 60 వేలు విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలు కొనుగోలుపై ఒక ప్రోత్సాహకమైన బంగారు నాణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్ డిసెంబర్ 18 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే వజ్రాల ఆభరణాలపై 20 శాతం ప్లాటినం ఆభరణాలపై ఏడు శాతం డిస్కౌంట్ కూడా ఇస్తున్నామని వెండి నగలపై తరుగు చార్జీలు ఉండవని ప్రకటించారు. ప్రతి కొనుగోలుతో ఒక ప్రత్యేక బహుమతి కూడా ఉంటుందన్నారు. తమ షోరూమును విజయవంతం చేయాలని నెల్లూరు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# విద్యుత్ లోఓల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 14)

లో ఓల్టేజ్ విద్యుత్ అంతరాయంకు శాస్వత పరిష్కారం ఏర్పాటు చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.శనివారం కనిగిరి పట్టణంలోని సాయి నగర్ ప్రాంతంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోగా లో ఓల్టేజ్ విధ్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని తెలియజేయగల వెంటనే విధ్యుత్ శాఖ అధికారులను పిలిపించి నూతన విధ్యుత్ ట్రాన్ఫర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ సమస్య తల్లేత్త కుండా నూతన విధ్యుత్ స్థంబాలు మరియు కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విధ్యుత్‌శాఖ ఏఈ పవన్ కుమార్, రాష్ట్ర వికలాంగు హక్కుల వేదిక అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు, వెంగయ్య, స్థానిక నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని వెంటనే ఆపండి

## ప్రజాసంఘాల డిమాండ్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 14)

ఎన్ గొల్లపల్లి నుంచి సుల్తాన్ పురంకు ప్రస్తుతం అక్రమంగా నిర్మాణం చేస్తున్న రోడ్డు పనులను సత్వరమే ఆపివేయాలని ప్రజాసంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. పట్టాదారులైన రజక యాదవులకు నష్టం కలిగించే పద్ధతిలో వారి అనుమతి లేకుండా అడ్డగోలుగా రోడ్డు నిర్మాణం చేపట్టడాన్ని ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తూ, నేడు బాధితులకు చెందిన పట్టా భూములను, జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను స్వయంగా పరిశీలన చేశాయి. అధికారికంగా గొల్లపల్లి నుండి సుల్తాన్పురం వరకు పంచాయతీ విడగొట్టిన పాత రోడ్డు ఉండగా, దానిని తారు రోడ్డుగా మార్చేందుకు చర్యలు చేపట్టకుండా, జనం సౌలభ్యం కోసం సర్వేనెంబర్ 884, 882 కు చెందిన పట్టా భూములలో ఏర్పాటు చేసుకున్న కాలి బాటను, రోడ్డు నిర్మాణం పేర సదరు పొలాన్ని కాజేయాలని కుట్ర చేయడం ఏమిటని ప్రశ్నించారు. పాము మెలికలు తిరిగినట్లుగా ఇష్టం వచ్చిన పద్ధతిలో, సాగుకు నష్టం కలిగించే పద్ధతిలో పొలాన్ని ముక్కలు ముక్కలుగా చేసే పద్ధతిన, పట్టా పొలం మధ్యలో రోడ్డు నిర్మాణం చేయడం వెనుక కుట్ర దాగి ఉందని వారు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంకు అసైన్మెంట్ భూములు ఉండగా దానికి భిన్నంగా పట్టాదారుల అనుమతి లేకుండా, తగిన నష్టపరిహారం చెల్లించకుండా, రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. బాధితులైన పట్టాదారులు ఉప్పలపాటి కొండయ్య ఎర్రయ్య లక్ష్మమ్మ జవ్వాజి గాలయ్య రమేష్ పెద్ద చెంచయ్య చిన్న చెంచయ్య రవి నాగేశ్వరరావు దాసరి పెదనరసయ్యలు,కనిగిరి పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ అధికారులను కలిసి తమ గోడును వెళ్లబుచ్చుకున్నా, బాధ్యతారహితంగా, నిర్లక్ష్య పూరితమైన వాదనలు చేయడాన్ని ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. పట్టాదారులకు నష్టం కలిగించే ప్రస్తుత రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని, గొల్లపల్లి నుండి సుల్తాన్పురంకు పంచాయతీ వారు విడగొట్టిన పాత బాటనే తారురోడ్డుగా నిర్మాణం చేయాలని, లేనియెడల తీవ్రస్థాయిలో ఆందోళనకు పూనుకోగలమని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ అధికారులను హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీవీ శేషయ్య,దేపూరి వెంకటేశ్వర్లు, చీమలదిన్నె వెంగయ్య రావినూతల కొండయ్య, పల్లా మాలకొండరావు, మోహన్ రావు, చింతలపూడి వాసు కటికల ఆగస్టీన్, బొప్పరాజు సుబ్బారావు, పులి రాయుడు, వెంపాటి మల్లికార్జున్, కండ్ల కుంట గురుప్రసాద్, పి నరసింహం, తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగ సమస్యకు పరిష్కారమే జాబ్ మేళా

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 14)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీని మెగా జాబ్ మేళా ద్వారా నెరవేరుస్తున్నామన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదివారం అనగా 15-12-2024 న విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ లో నివహించే మెగా జాబ్ మేళా వివరాలను ఆమె మీడియాకు వివరించారు. మూడు నెలల క్రితం సెప్టెంబర్ 14 న నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు 1,000కి పైగా యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రూపుమాపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు ప్రేరణతో వారి ఆకాంక్షల మేరకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆదివారం విపిఆర్ కన్వెన్షన్లో జరిగే మెగా జాబ్ మేళా సందర్భంగా 100 కు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటాయన్నారు. ఈ సారి విప్రో, టెక్ మహేంద్ర లాంటి 14 ప్రముఖ ఐటి కంపెనీలు జాబ్ మేళాలో ప్రాతినిధ్యం వహించనున్నాయన్నారు. ఈ సారి జరిగే జాబ్ మేళా ద్వారా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 10 వేల మందికి పైగా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. నిరుద్యోగుల కళ్ళలో ఆనందం చూడాలన్నది ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆశయమన్నారు. విపిఆర్ ఫౌండేషన్ నిర్వహించే సామాజిక సేవలో భాగంగా తమ వంతు సహాయంగా నిరుద్యోగ యువత కోసం విపిఆర్ ఫౌండేషన్ జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విపిఆర్ లాంటి మహోన్నత వ్యక్తి ఎంపి కావడం నెల్లూరు జిల్లా వాసుల అదృష్టం. అనంతరం తెలుగుదేశం నాయకులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోదరులు గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా చాలా మంది పని చేసారని ప్రజల కోసం పని చేసే ఎంపి ని తొలి సారి గా చూస్తున్నానన్నారు. నిరుద్యోగ యువత కోసం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో విపిఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళా జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాసేవలో తరిస్తున్న వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విడవలూరు టిడిపి ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, యువ నాయకులు బెజవాడ వంశీ రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం టిడిపి ఇంచార్జి అడపాల అనీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఘనంగా మాచర్ల పట్టణంలో నూతన వ్యాపార ప్రారంభోత్సవం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, డిశంబర్ 14)

పట్టణంలోని నెహ్రూ నగర్ నందు వివిఎన్ గార్డెన్స్ ఎదురుగా విజయలక్ష్మి మార్బుల్స్ గ్రానైట్స్ టైల్స్, శానిటరీకి సంబంధించి నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు ఘనంగా చేశారు. ఈ విషయమై ప్రొప్రైటర్ మాచర్ల నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజె అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఆదివారం జరగబోయే ప్రారంభోత్సవ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని, చాలా వరకు పట్టణంలోని ప్రముఖులను ఆహ్వానించామని, ఎవరినైనా మర్చిపోయి ఉంటే ప్రేమతో మన్నించి అన్యధా భావించక ప్రారంభోత్సవ కార్యక్రమానికి తప్పక రావాలని ఆయన కోరారు. మాచర్ల పట్టణ గృహ నిర్మాణదారులు గతంలో మార్బుల్స్ టైల్స్ గ్రానైట్స్, శానిటరీకి సంబంధించి పెద్ద పెద్ద పట్టణాలను ఆశ్రయించాల్సి వచ్చేదని, ప్రస్తుతం మా షాపులోనే నూతన మోడల్స్ అన్నీ దొరికేలా వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రకరకాల నూతన రంగులతో వినియోగదారులను మెప్పించి వారి హెూదాకు తగ్గట్టుగా మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్, శానిటరీ వస్తువులను అందివ్వగలమన్నారు. ఒక్కసారి మా వద్ద కొనుగోలు చేసే వినియోగదారులు మేము ఇచ్చే నాణ్యతకు తృప్తి పడగలరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. మీడియా మిత్రులు, పట్టణంలోని వ్యాపారవేత్తలు, మార్బుల్స్, గ్రానైట్, టైల్స్, శానిటరీ పనులు చేసే మేస్త్రిలు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు తప్పక మా ఈ నూతన వ్యాపార ప్రారంభోత్సవ ఆహ్వానాన్ని మన్నించి మా షాపునకు విచ్చేసి మా వ్యాపార అభివృద్ధికి మీ తోడ్పాటు సహకారం అందిస్తారని, మా ఆతిథ్యం స్వీకరించి మమ్ములను ఆశీర్వదించాలని కోరారు.

# బీసీ సంక్షేమ సంఘం గిద్దలూరు మండల అధ్యక్షులుగా సారె శివయ్య



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, డిశంబర్ 14)

బీసీ సంక్షేమ సంఘం గిద్దలూరు మండల అధ్యక్షులుగా సారె శివయ్యను నియమించినట్లు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ ఆదేశాల మేరకు నియమించి నియామక పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బోధనబోయిన అరుణ్ కుమార్ యాదవ్, బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

## ఎస్పీకి వినతి పత్రం అందజేసిన ఏపీయుడబ్ల్యూజే నేతలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 14)

ఇటీవల హైదరాబాద్‌లో టీవీ9, సుమన్ ఛానెల్ ప్రతినిధులు, అలాగే పులివెందుల నియోజకవర్గంలో సాగునీటి ఎన్నికల కవరేజీ కోసం వెళ్ళిన జర్నలిస్టుల పై అనాగరికంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ, అలాగే దాడికి పాల్పడిన వారి పై కేసు నమోదు చేయాలని కోరుతూ ఏపీయుడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏ అర్ దామోదర్‌ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీని కలసిన వారిలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ సురేష్, జిల్లా అధ్యక్షులు ఎన్ వి రమణ, కార్యదర్శి డి కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి వెంకట్రావు, కార్యదర్శి ఈ శంకర్, యూనియన్ నాయకులు పగడాల శ్రీనివాస్, కోనూరు శ్రీనివాస్, సాక్షి సాబీర్, 99 టివి స్టాఫర్ రంగారావు, పట్నం శ్రీనివాసులు (సివిఆర్), తదితరులు ఉన్నారు.


# ఎస్ఐ దంపతులకు సత్కారం

(షణ్ముఖ వెలుగు, చిలకలూరిపేట, డిశంబర్ 14)

బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మాలధారుల అన్నదానానికి బల్లికురవ ఎస్ఐ జివి చౌదరి దంపతులు సహకారం అందించారు. శనివారం అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు పూసల హరి బాబు, దివి పవనాచార్యులు ఎస్ఐ జివి చౌదరి దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.




# నేటి నుండి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలు ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 14)

తిరుమల తిరుపతి దేవస్థానములు, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సౌజన్యంతో స్థానిక గాంధీ రోడ్డులోని గీతా మందిరంలో ఈనెల 16వ తేదీ సోమవారం నుండి ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులుచే తిరుప్పావై ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు మందిరం భక్త బృందం నిర్వాహకురాలు సురేఖ తెలిపారు. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతున్న దృష్ట్యా గోదాదేవి రచించిన 30 పాశురాలపై ఈ నెల 16వ తేదీ నుండి జనవరి 13వ తేదీ భోగి వరకు నెలరోజులు తిరుప్పావై ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి తిరుప్పావై, భగవద్గీత పారాయణ, 9 గంటలకు నుండి తిరుప్పావై పై ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. కనుక భక్తులు ప్రతిరోజు జరిగే తిరుప్పావై ఉపన్యాస కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి స్వామి, గోదాశ్రీరంగనాధుల అనుగ్రహానికి పాత్రులు కావలసిందిగా కోరారు. తిరుప్పావై ప్రవచనానికి సంబంధించి బ్యానర్స్ ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గీతా మందిరం భక్త బృందం కృష్ణ, రాజేష్, మువ్వల సుబ్బారావు, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, అరుణ, అనిత, రాధా, తదితరులు పాల్గొన్నారు.



# జనసేన జెండా ఆవిష్కరణ




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 14)

నెల్లూరు సిటీ 6వ డివిజన్ పప్పులవీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద జనసేన పార్టీ జెండాను ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, జనసేన నాయకులు మంచకంటి శ్యామ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, సుందర్ రామిరెడ్డి, జమీర్, నగర అద్యక్షులు దుగ్గిసెట్టి సుజయ్ బాబు, శ్రీరామ్, కృష్ణారెడ్డి, ఆలియా, రవికుమార్, చంద్రశేఖర్ రెడ్డి, గుర్రం కిషోర్, ప్రసాద్ యాదవ్, మనోజ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

# నందనవనం నీటి సంఘం అధ్యక్షుడిగా పెన్నా గురవయ్య

(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, డిశంబర్ 14)

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో నందనవనం నీటి సంఘం అధ్యక్ష ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలోని నందనవనం గ్రామంలో నీటి సంఘం అధ్యక్షులుగా పెన్నా గురవయ్య ఉపాధ్యక్షులుగా ఆకుపాటి వెంకటయ్యను సభ్యులుగా గంధం బాలకోటయ్య, కొప్పు సుబ్బమ్మ, సూరగాని బాల నాగయ్య,షేక్ కమాల్ నీయమితులయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి వారికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముప్పరంగ సాయి యాదవ్, చీకటి వెంకట సుబ్బయ్య, ఆకుపాటి శ్రీను, నాసర్, కొప్పు సత్యం, వెంకట శివ నారాయణ, షేక్ ఖాసీం, షేక్ నాసర్, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎస్ఐ కే మాధవరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, డిసెంబర్ 14)

వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆద్వర్యంలో స్థానిక యర్రగొండపాలెం పట్టణం లోని మానసిక వికలాంగుల అనాథ శరణాలయంలో అంతర్జాతీయ ప్రపంచ వికలాంగుల దినోత్సవం కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య మాట్లాడుతూ నా వికలాంగ సోదరి సోదిరి మనులారా మనమంతా ఒక్కటై కదులుతే కాని పని అంటూ ఉండదు మనలో ఎప్పుడైతే ఐక్యత లోపిస్తాదో అప్పుడు మనము ఎన్ని డిమాండ్లు చేసిన ఒక్క డిమాండ్ కూడా నెరవేర్చుకోలేము అని స్పష్టంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సింగిల్ రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం కేటాయించి, పక్కా గృహాలు నిర్మించాలని ఆయన డిమాండ్






చేశారు. ఈ కార్యక్రమం లో నియోజక వర్గ అధ్యక్షులు పోలేపల్లి పెద్ద పాలంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదు లక్షల వరకు సబ్సిడి రుణాలు అందించాలి. అలాగే ప్రభుత్వం వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి కణమల చిన్నా కోటేశ్వరరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకం లో రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చేదూరి సుధాకర్,బ్రహ్మారెడ్డి, శ్రీను , నాసరువలి, మురళీ, వెంకటేశ్వర్లు లతో పాటు యాభై మంది వికలాంగులు పాల్గొన్నారు.

# మండలంలో సాగునీటి ఎన్నికలు అన్ని ఏకగ్రీవాలే

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిశంబర్ 14)

మండలంలోని నీటి సంఘం అధ్యక్షులను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలో మొత్తం 8 నేటి సంఘ అధ్యక్షులు ఉండగా వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు.మండల స్థాయి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికైన వారికి మండల స్థాయి అధికారులు శ్వేతా పత్రాలను అందజేశారు. ఎన్నికలను మండల సాధికారలు పకడ్బందీగా నిర్వహించారు. బద్వీడు చెర్లోపల్లి నుంచి ఆకుమల్ల శ్రీనివాసరెడ్డి. కర్రోల గ్రామం నుండి చిమట గాలయ్య, పెద్దారవీడు గ్రామం నుంచి గొట్టం రఘునాథరెడ్డి. దేవరాజు గట్టు గ్రామం నుంచి గుమ్మ అచ్చయ్య, తంగిరాలపల్లి గ్రామం తంగిరాల సావిత్రి, స్థానికవరం గ్రామం గుంటక రవిశంకర్‌రెడ్డి, బోయిద గుంపుల గ్రామం చిన్నచ్చిరెడ్డి, ఓబులక్క పల్లి గ్రామం దుగ్గెంపూడి కొండారెడ్డి, 8 గ్రామాల నీటి సంఘాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి మండల అధికారులు ఏకగ్రీవ పత్రాలను అందజేశారు.








# జిల్లా కలెక్టర్‌తో ఏపీ టిడ్కో చైర్మన్ భేటీ

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 14)

ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌తో పూర్తయిన టిడ్కో ఇళ్ల లో నివాసయోగ్యమైన వసతులు కల్పించి లబ్దిదారులు తమ నివాసాలకు రంపించే ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఇల్లు లేని పేదలు ఉండకూడదని నిర్మించిన నాణ్యమైన ఇళ్ళ నివాసానికి వారు రాకపోవడం గురించి సుదీర్ఘ చర్చ జరిపారు. ముందుగా టిట్కో హౌసెస్ దగ్గర జరుగుతున్న అసాంఘీక కార్యక్రమాల కట్టడి చేయాలని, అల్లిపురం వద్ద అతిపెద్ద ట్యాంకర్ నిర్మించినప్పటికీ నీటి వసతి సరిగా అందించలేకపోవడం, మున్సిపల్ సిబ్బంది కొరత వంటి సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వం తరఫున నిధులు విడిపించి మిగిలిన పనులు పూర్తి చేసి స్వచ్ఛందంగా ప్రజలు వచ్చే ఏర్పాట్లు విషయం చర్చించారు.ఈ కార్యక్రమంలో వేముల పాటి అజయ్‌తో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కిషోర్ గునుకుల, జిల్లా పార్టీ ఆఫీస్ ఇంచార్జ్ జమీర్, రిషికేష్ యాదవ్, శరత్, ప్రశాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





# ఒంగోలు నియోజకవర్గంలో 12 సాగునీటి స్థానాలు టీడీపీ కూటమి ఏకగ్రీవం

## ఏకగ్రీవమైన సభ్యులను అభినందించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 14)

ఒంగోలు నియోజకవర్గంలో జరిగిన 12 సాగునీటి సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు 11 స్థానాలు జనసేనకి ఒక్కటి ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన 11మంది అధ్యక్షులతోపాటు ఉపాధ్యక్షులను డైరెక్టర్లను ఎమ్మెల్యే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభినందించి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికైన వారిలో యరజర్ల, చైర్మన్ గోదాసు వెంకట స్వామి (జనసేన), వైస్ చైర్మన్ కంకణాల ఆంజనేయులు(బీజేపీ), కొత్తమామిడిపాలెం, చైర్మన్ పెండ్యాల రోశయ్య, వైస్ చైర్మన్ మేదరమిట్ల రవిచంద్ర బాబు, వల్లూరు, చైర్మన్ కంకణాల వేణు, వైస్ చైర్మన్ పెళ్లూరు వెంకటేశ్వర్లు, కొప్పోలు 1, చైర్మన్ బత్తిన కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ జిల్లమూడి నరసింహారావు, కొప్పోలు 2 చైర్మన్ పోతినేని వేణు, వైస్ చైర్మన్ కాట్రగడ్డ రాఘవరావు, అల్లూరు చైర్మన్ బంకా వెంకయ్య, వైస్ చైర్మన్ బొమ్మిరెడ్డి శీనారెడ్డి, అలూరు చైర్మన్ కనుబడ్డీ పుల్లారెడ్డి, వైస్ చైర్మన్ గాదె లింగారెడ్డి, ఈతముక్కల 2 చైర్మన్ బద్దేలి రామసుబ్బారెడ్డి, వైస్ చైర్మన్ మచ్చా మోహనరావు, ఈతముక్కల 1 చైర్మన్ సూరగాని కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ పొన్నపూడి చిన్న, పెళ్లూరు చెరువు చైర్మన్ మద్దూలూరి అయ్యన్న, వైస్ చైర్మన్ నాగం వెంకటేశ్వర్లు(జనసేన), పాదర్తి చెరువు చైర్మన్ ముగా పోలరాజు, వైస్ చైర్మన్ వాటంశెట్టి శ్రీరాములు, అల్లూరు చెరువు చైర్మన్ గుత్తికొండ వెంకట సుబ్బమ్మ, వైస్ చైర్మన్ మితశాల జయరాం గెలుపొందారు. వీరందరికి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.







## పెద్దారవీడు నీటి సంఘం అధ్యక్షుడిగా గొట్టం వెంకట రఘురామిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిశంబర్ 14)

పెద్దారవీడు నీటి సంఘం అధ్యక్షుడిగా గొట్టం వెంకట రఘురామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వల్లూరి నారాయణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. వారిని మండల టిడిపి మాజీ అధ్యక్షులు గొట్టంశ్రీ నివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వల్లూరు సుబ్బారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుల గొట్టం వెంకటరెడ్డి, టిడిపి నాయకులు గొట్టం రామకృష్ణారెడ్డి, జానపాటి కోటేశ్వరరావు, దేశి రెడ్డి చిన్నకాశిరెడ్డి, అల్లు వెంకట్ రెడ్డి, గుండారెడ్డి కృష్ణారెడ్డి,అల్లు నారాయణరెడ్డి, సంకుల పెద్దకోటయ్య, గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారికి హృదయపూర్వకశుభాకాంక్షలు తెలియజేశారు.

## బాలకృష్ణ అభిమాని బెల్లంకొండ రమణయ్యకు నివాళులు అర్పించిన చేజర్ల



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, డిశంబర్ 14)

నందమూరి బాలకృష్ణ వీరాభిమాని,తెలుగుదేశం పార్టీ కార్యకర్త బెల్లంకొండ రమణయ్య అనారోగ్య మృతి చెందగా, కోవూరు రాళ్ళమిట్ట లోని వారి నివాసంలో రమణయ్య పార్థివ దేహానికి, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి ఆదివారం నివాళులు అర్పించారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు బుదవరపు శివకుమార్,మరుబోయిన వెంకటేశ్వర్లు, ఇందుపూరు మురళీ కృష్ణ రెడ్డి, వల్లేపు సురేష్, సజ్జా అశోక్, తదితరులు ఉన్నారు.

## గొల్లపల్లి నీటిసంఘాల ప్రెసిడెంట్‌గా ఉడత హజరత్తయ్య

(షణ్ముఖ వెలుగు, చేజర్ల, డిశంబర్ 14)



చేజర్ల మండలం గొల్లపల్లి గ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి , కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు సహకారంతో సోమశిల 24 ఎల్ గొల్లపల్లి కాలువకు 12 టీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్‌గా ఉడత హజరత్తయ్య, వైస్ ప్రెసిడెంట్ గా గంగారపు రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.

## చేజర్ల పెద్ద చెరువు చైర్మన్‌గా ఆరవ గోపిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, డిశంబర్ 14)

మండలంలోని నీటి సంఘాలు ఎలక్షన్ ఏకగ్రీవ చేజర్ల పెద్ద చెరువు చైర్మన్ ఆరవ గోపిరెడ్డి, వైస్ చైర్మన్‌గా ఉడుత పెంచలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఈవో ఎలక్షన్ ఆఫీసర్ తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు రావి లక్ష్మాసారెడ్డి, రావి కృష్ణారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com